




అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్

కలవరపెడుతున్న స్క్రబ్ టైఫస్

- 11 కేసులు నమోదు : డిఎంహెచ్‌ఒ



ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా ప్రజలను స్క్రబ్ టైఫస్ వ్యాధి కలవర పెడుతోంది. ఇటీవలి కాలంలో ఈ వ్యాధి రాష్ట్రంలోకి ప్రవేశించడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ ఈ వ్యాధి భారీ నుంచి రక్షించుకోవాలని, సలహాలు సూచనలు ఇస్తున్నారు. జిల్లాలో 46 కేసులు నమోదు కాగా మదనపల్లి నియోజకవర్గంలో 11 కేసులు బయటపడ్డాయి. వాటిలో కోళ్లబైలు, సిటిఎం, కొత్తవారిపల్లిలో రెండు, బసినికొండ, రామారావు కాలనీ, శివాజీ నగర్, ముజీబ్ నగర్, నిమ్మనపల్లి, కురబలకోట, బి.కొత్తకోట ప్రాంతాలలో ఈ కేసులు బయటపడ్డాయి. 11 మందికి పాజిటివ్‌గా తేలింది. వీరికి తిరుపతి రుయాలో వ్యాధి నిర్ధారణ చేయగా పాజిటివ్ వచ్చింది. వారందరికీ ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ అనే వ్యాధి పేడ పురుగు ద్వారా సంక్రమిస్తోందన్నారు. పేడ పురుగు ఎలుకలు సంచరించే ప్రదేశంలో, వ్యవసాయ పొలాల్లోని చెట్ల పొదల్లో ఉంటుందని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పనుల నుంచి పంట ధాన్యాలు, గడ్డి, వగైరా సేకరించి తీసుకెళ్ళే సమయంలో ఆ పురుగు వారి మీద పడి కుట్టినప్పుడు ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఎలుకలు సంచరించే ప్రదేశంలో పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ కార్మికులు పని చేస్తుంటారని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పారిశుధ్య పనులు చేసేటప్పుడు ఈ పురుగు కుట్టే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విపరీతమైన జ్వరం, వికారం, వాంతులు, తలనొప్పి, నీరసం, గస, ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే స్క్రబ్ టైఫస్ వ్యాధి సంక్రమించినట్లు గుర్తించాలన్నారు. పురుగు కుట్టినచోట నల్ల మచ్చ ఏర్పడి, ఎర్రటి దద్దుర్లు సంభవిస్తాయని, వెంటనే సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి తిరుపతి రుయా ఆస్పత్రిలో ఎలిసా పరీక్ష చేస్తారని, దీని ద్వారా వ్యాధి నిర్ధారించి ఐదు రోజుల్లోనే ఈ వ్యాధిని నయం చేస్తారని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ తెలిపారు. ఇది అంటువ్యాధి కాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపును తమ ఇంటి నుంచే ప్రారంభించాలని డిఆర్‌ఒ మధుసూదన్‌రావు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు 2025ను పురస్కరించుకుని బుధవారం పట్టణంలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం పని చేసే కార్యాలయాలు, గృహాల్లో మొదటగా విద్యుత్ ఆదా చేయడం చాలా ముఖ్యమన్నారు. విద్యుత్ శాఖ పర్యవేక్ష ణాధికారి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో ఇచ్చిన రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రతిఒక్క ఉద్యోగి అమర్చు కోవాలన్నారు. వినియోగదారులందరికీ అవగాహన కల్పించి ప్రతిఒక్క ఇంటి పైన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునే విధంగా చూ డాలన్నారు. ఈ ర్యాలీ 33/11 కె.వి. రాయ చోటి సబ్‌స్టేషన్ నుంచి ప్రారంభమై బంగ్లా దగ్గర మానవహారంగా ఏర్పడి విద్యుత్ పొదుపు పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాయచోటి డివిజన్ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ యుగం ధర్, జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మయ్య చారి, డిఇఇలు, ఎఇలు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. **పీలేరు:** విద్యుత్ వృధాను అదుపు చేస్తూ పొదుపుగా దాన్ని విని యోగిస్తూ, సహజ వనరులను కాపాడి భవిష్యత్ తరాలకు వెలుగులు పెంచా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని ఉందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ఎపిఎస్‌పిడిసిఎల్ పీలేరు డివిజన్ అధికారులు తమ సిబ్బందితో కలిసి పట్టణంలో ఎందరో పొదుపుపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ దేశ అభివృద్ధి విద్యుత్ వినియోగంతో ముడిపడి ఉందన్నారు. విద్యార్థులు ఇంధన పొదుపు విషయంపై కుటుంబ సభ్యులు, సమాజానికి అవగాహన కల్పించే బాధ్యతను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇఇ వై.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు డిఇఇలు జి.అమీర్‌బాష, ఎం.శివయ్య, అసిస్టెంట్ ఇంజినీర్లు డి.ఖాదర్ ఇలాహి, ఎస్. రామ్మూర్తి, బి.గురుశంకర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** ఇందనం పొదుపు చేద్దాం.. భావి ఃతరాలకు వెలుగు నిద్దామని ట్రాన్స్‌కో డిఇ గంగాధరం అన్నారు. బకోసువారిపల్లె హైస్కూల్లో విద్యార్థులకు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవడంపై అవగాహన కల్పించారు. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 40శాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. కార్యక్రమం ఎఇలు గోవింద రెడ్డి, సురేంద్ర, ఎఎల్ భాస్కర్, ఎంఇఒ త్యాగరాజు పాల్గొన్నారు.



రాయచోటి : జెండాను ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఆర్‌ఒ మధుసూదన్‌రావు

రాజంపేట అభివృద్ధికి కలిసిరండి : సబ్ కలెక్టర్



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి-రాజంపేట

పెన్షనర్లు తమ అపారమైన అనుభవంతో సీనియర్ సిటిజన్స్‌గా మీరిచ్చే సూచనలు ఎంతో విలువైనవని, మీ సలహాలు, సూచనలతో రాజంపేట అభివృద్ధికి కలిసిరావాలని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన పేర్కొన్నారు. రాజంపేట పెన్షనర్స్ అసోసియేషన్ రాజంపేట అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య అధ్యక్షతన బుధవారం అఖిలభారత పెన్షనర్ల దినోత్సవాన్ని స్థానిక సబ్ కలెక్టర్ సభా భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పెన్షనర్లకు ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇస్తామని, వారి సమస్యలు వినడానికి, పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పెన్షనర్లు కూడా తమ అనుభవాలను రాజంపేట అభివృద్ధికి వినియోగించాలని కోరారు. 75 సంవత్సరాలు పైబడిన పెన్షనర్లను ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శాలువా కప్పి, పూలదండతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పెన్షనర్లు అడిగిన వెంటనే విచ్చేసిన సబ్ కలెక్టర్‌ను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాజంపేట తాలూకా యూనిట్ తరపున సంఘ అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య, కోశాధికారి జి.వి.చలపతి, ప్రధాన కార్యదర్శి పి.ఎల్లయ్య, విశ్రాంత రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు ముఖ్య సలహాదారు ఎస్.ఈశ్వరయ్య, గౌరవ సలహాదారు ఒ.రామచంద్రయ్య, విశ్రాంత తహశీల్దార్ సత్కరించారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్ : పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని ఆంధ్ర పెన్షనర్స్ జిల్లా సెక్రటరీ డాక్టర్ మునిగోపాల్ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ఆధ్వర్యంలో ఆలిండియా పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని మదనపల్లె జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జిల్లా జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎస్.మునిగోపాలకృష్ణ, ట్రెజరర్ తిమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పెన్షనర్ల పితామహుడు నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో నకారా కేసు గెలవడం ద్వారా నేడు పెన్షన్ లభిస్తోందన్నారు. పెన్షనర్లకు రివైజ్డ్ పే స్కేల్స్ వెంటనే అమలు పరచాలని, ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలని, పెన్షనర్లకు బకాయిలు వెంటనే చెల్లించాలని, ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్ పరిమితిని పెంచాలన్నారు. 15 ఏళ్ల పరిమితిని 12 ఏళ్లకు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ జగన్మోహన్, అడహాక్ కమిటీ మెంబర్ శివప్రసాద్, పెన్షనర్లు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి : 'సుగవాసి'



విలేకరులతో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి బలోపేతానికి కృషి చేస్తానని అన్నమయ్య జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబు స్పష్టం చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షుడిగా నిమితులైన సుగవాసి బుధవారం మదనపల్లి పట్టణానికి విచ్చేశారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆయనకు పూలమాల, శాలువాతో ఘనస్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ తనకు జిల్లా అధ్యక్ష పదవి రావడానికి కృషి చేసిన మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఎమ్మెల్యేల సహకారం, సూచనలతో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్, పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, ఆర్టీసీ 1, 2 డిపోల ఇయు గౌరవాధ్యక్షులు నాగూర్ వలి, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, ముసలికుంట నాగయ్య, నవీన్ చౌదరి, ఎస్.ఎం రఫీ, రాటకొండ మధుబాబు, బొమ్మిశెట్టి పురుషోత్తం, సూదిళ్ల సుధాకర్, తలారి రాధమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'నల్లారి'ని కలిసిన 'సుగవాసి'

కలికిరి : టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన సుగవాసి ప్రసాద్‌బాబు బుధ వారం పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారికిషోర్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ 47సంవత్సరాల తమ కుటుంబ సుదీర్ఘ కృషికి సిఎం చంద్రబా బు, మంత్రి నారా లోకేష్ తగిన ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. సీనియర్లతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులుగా తన పేరును సూచించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన సూచనలతో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం అభివృద్ధికి నాయకులు కార్యకర్తలు కలిసి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఖాన్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విరాళాల సేకరణలో సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

కార్మికుల చేయూత అభినందనీయం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజా కార్మిక ఉద్యోగ సమస్యలు కొరకు నిత్యం పోరాడే సిఐటియు ఆలిండియా మహాసభలకు చిన్న మధ్య తరహా కార్మికులు చేయూత నివ్వడం చాలా అభినందనీయమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, వ్యవసాయం కార్మికుల సంఘం కార్యదర్శి ఎం.సుధీర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర పేర్కొన్నారు.బుధవారం స్థానిక గాలివీడు పట్టణంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వరకు జరుగుతున్న ఆలిండియా మహాసభల జయప్రదానికి మాస్ ఫండ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చిన్న మధ్య పరిశ్రమలు మూసివేయడం, ఉపాధి లేకుండా చేసి నిరుద్యోగం పెంచడం, ఆహార సమతుల్యత కుంటుపడడం, ప్రభుత్వ రంగ సంస్థలు మూసివేయడం, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరచడం ఏ మాత్రం సరి కాదన్నారు. రైతులకు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కొరకు పోరాడటమన్నారు. వామపక్ష సంకీర్ణ ప్రభుత్వం తోడ్పాటుతో వచ్చిన ఉపాధి హామీ చట్టం నేడు ఒక పథకంగా నేడు నిర్వీర్యం అయిపోతున్నదన్నారు. తోపుడు బండి హమాలీ , బిల్డింగ్, ఆటో కార్మికులతో పాటు ఇతర ఉద్యోగులు జనవరి 4న వైజాగ్‌లో బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఓబుళమ్మ, మెహరాజ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట: ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో నర్వకాటిపల్లి, గంగపేరూరు పంచాయతీలకు చెందిన వరికుంట్ల యానాదయ్య, ఎ.వీరయ్య, బి.నాగరాజు, నరసింహులు, మామిడి మురళి, చరణ్, సురేష్, కొండయ్య ఉద్యమానికి తమ మద్దతు తెలిపుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా తీసుకునే పరిపాలనా నిర్ణయాలను సహించబోమని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు రామదాసు, బొబ్బిలి, పాటూరు గంగిరెడ్డి, రోశయ్య, సుబ్బరాయుడు, పొట్టేటి రాజారెడ్డి, ఎమ్మెస్ వెంకట్‌రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, కత్తి చంద్ర, అజ్మతుల్లా సుబ్బరామయ్య, వెంకటేశు పాల్గొన్నారు.

రేపటి నుంచి వాలీబాల్, ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

భారత ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, మైభారత్, సురేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జమ్మలమడుగు నియోజకవర్గ స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి పిఆర్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ సీఈఓ చింత కుంట సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ పోటీల్లో 16-28ఏళ్లలోపు యువకులు, ఖోఖోలో 16-26 ఏళ్లలోపు యువతులు పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన జట్టుకు నగదుతోపాటు ట్రోఫీ, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన జట్లను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామనాన్రు. పాల్గొనదలిచిన జట్లు ట్రస్ట్ సీఈవో సురేంద్ర 88868 98483 నెంబర్‌ను సంప్రదించి వారి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే



సహాయ పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెలుగు సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు బుధవారం ఉచిత సహాయ జీవన పరికరాల పంపిణీ చేపట్టారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వ ర్యంలో పనిచేస్తున్న అలింకో), జిల్లా పరిపాలన, ఎంఎస్‌జెఇ సంయు క్తంగా ఈ సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వికలాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాల కొరతను తీర్చడం ద్వారా వారి స్వావలంబనను పెంచడమని వికలాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ తెలిపారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలలో ఆగస్టు 6 నుంచి 8వ తేదీ వరకు ఎడిఐపి అండ్ ఆర్‌వివై పథకాల కింద అంచనా శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 832 మంది లబ్ధిదారులను గుర్తించి, రూ.1,21,05,454 విలువైన 2,292 సహాయక పరికరాలను మంజూరు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా పంపిణీ కార్యక్రమాన్ని మూడు దశలుగా చేపట్టారు. బుధవారం జడ్‌పి హైస్కూల్‌లో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 442 మంది వికలాంగులు, వృద్ధులకు రూ.60,41,384 విలువైన 931 రకాల సహాయక పరికరాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జిల్లా సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ముఖ్య అతిథులు హాజరయ్యారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వం పెరుగుతుందన్నారు. అలింకో, ఎంఎస్‌జెఇ జిల్లా పరిపాలన సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. సహాయక పరికరాలు లబ్ధిదారుల జీవితాల్లో స్వతంత్రతను తీసుకువస్తాయని పేర్కొన్నారు. వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వెలుగు సంస్థ గత 28ఏళ్లుగా వికలాంగులకు, వృద్ధులకు నిరంతర సేవలను అందిస్తూ ఎన్నో సహాయక పరికరాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, వికలాంగులు, వృద్ధులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి: మండలంలో ఈనెల 21వ తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష, రెవెన్యూ అధికారి రాంప్రసాద్ తెలిపారు. మెడికల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు బుధవారం తాహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులతో కలసి ప్రజలకు పల్స్ పోలియో చుక్కలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు సిహెచ్‌ఒ ఇంద్రావతి తెలిపారు. ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు, ప్రజలకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి పోలియో కేంద్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 0-5 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలను వేయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** డిసెంబర్21వ తేదీ ఆదివారం రోజున అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించి పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేద్దామని మేడికుర్తి ద్వితీయ వైద్యులు డాక్టర్ ప్రసన్న లక్ష్మి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం లో డాక్టర్ ప్రసన్న లక్ష్మి ఆద్వర్యంలో 21 ఆదివారం జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమంపై ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు మరియు ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్, ఎంఎల్‌హెచ్‌పిలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ మ్మద్ రఫీ, సిహెచ్‌ఒ శాంత కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, గిరిజ పాల్గొన్నారు. **రాజంపేట :** పల్స్ పోలియో కార్యక మంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తం ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్.వికాస్, డాక్టర్ లక్ష్మీన రసమ్మ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించిమాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం చాలా గొప్పదని, ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది చెంగమ్మ, ఎఒ వయోలా, ఎఎన్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.



తంబళ్లపల్లి : పల్స్‌పోలియో నిర్వహణపై సూచనలు ఇస్తున్న సిడిపిఒ

తంబళ్లపల్లి : ఈనెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో అందరికీ చుక్కలు వేయాలని మెడికల్ ఆఫీసర్ సాదియా, సిడిపిఒ సుజాత సూచించారు. తంబళ్లపల్లె ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 0-5ఏళ్ల పిల్లలు 4,652 మంది ఉన్నారని చెప్పారు. 3రూట్లలో 33 పోలియో కేంద్రాలు, ఓ మొబైల్ బూత్ ద్వారా చుక్కలు వేస్తామన్నారు. **గాలివీడు :** 21న జరిగే మొదటి విడత పల్స్ పోలియోను విజయవంతం చేయాలని గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. గాలివీడు పరిధిలో 21 బూతులలో 421 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్ రఫీక్, సిహెచ్‌ఒ, చంద్రకళ, పిహెచ్‌ఎన్ఎం సాలమ్మ ఆశ వర్కర్లు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు :** వైద్యాధికారి కార్తీక్ విశ్వనాథ్ మాట్లా డుతూ మండలం లో 5 ఏళ్ల లోపు పిల్లలు 4300 ఉన్నారని వారందరికీ పోలి యో చుక్కలు వేయించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలంలో 48 పోలియో కేంద్రాలతో పాటు రైల్వే స్టేషన్, బస్టాండులో కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మండలాన్ని పోలియో రహిత మండలంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ అమరేశ్వరి, ఎంపిడిఒ ప్రసాద్, ఎంఇఒ అనంతకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీతమ్మ, సిహెచ్.ఒ వెంకటనా రాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాజుల భాస్కర్

ఉపాధి హామీ చట్టం మార్పును సహించం : డిసిసి

ప్రజాశక్తి-రాయచోటి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు చేపట్టడం ద్వారా మహాత్ముని ఆశయాలను విలువలను కార్మిక హక్కులను దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ పేర్కొ న్నారు. బుధవారం పట్టణంలోని నేతాజీ సర్కిల్ బస్టాండ్ రోడ్డు డివైడర్ పై ఉన్న గాంధీ విగ్రహం వద్ద గాజుల భాస్కర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డిసిసి అధికార ప్రతి నిధి మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడు ఆర్ చెన్న కృష్ణ, పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, జిల్లా జనరల్ సెక్రెటరీ అమీర్ మరి కొంతమంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాజుల భాస్కర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం మార్పును సహించమన్నారు. మహాత్మాగాంధీ పేరును తొలగించు కోవాలనుకోవడం కొత్త జిల్లాల ద్వారా పనిహక్కును పూర్తిగా రద్దు చేసేందుకు ప్రయత్నించడం కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు ఖాదర్‌ఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్ర జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - కడప: ఎసిఎ స్టేడియంలో ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య నాలుగు రోజుల పాటు జరగాల్సిన అండర్-19 స్టేట్ మ్యాచ్ రెండు రోజులకే ముగిసింది. ఉత్తరాఖండ్ జట్టుపై 10 వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ జట్టు 202 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా 42 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 71.2 ఓవర్లలో 254 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆనంద్ జోసాయి 49, మన్విత్ కుమార్‌రెడ్డి 39 పరుగులు చేశారు. ఉత్తరాఖండ్ జట్టులోని నిషు పటేల్ 5 వికెట్లు, లక్ష రైచందాని 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ జట్టు 36.0 ఓవర్లలో 102 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లక్ష (నాటౌట్), ఆయుష్ దేశ్వాల్ 25 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని ఎఎన్‌వి లోహిత్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ఎన్.రాజేష్ 4 వికెట్లు తీసుకున్నాడు. 55 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉత్తరాఖండ్ జట్టు ఆంధ్ర జట్టు ముందు ఉంచింది. 55 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 10.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 55 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. విజయం సాధించిన ఆంధ్ర జట్టుకు ఏడు పాయింట్లు లభించాయి.

శివకృష్ణారెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కడప అర్బన్ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన యానిమేషన్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఉండేల శివకృష్ణారెడ్డి చెన్నైలోని హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (డీమ్డ్ టు బీ యూనివర్సిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. హిందుస్థాన్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యదుర్గ, కెఎస్ఆర్ఎం కాలేజ్ సిఎస్ఇ విభాగం ప్రొఫెసర్ వి.లోకేశ్వర్‌రెడ్డి మార్గదర్శకత్వంలో హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ద్వారా యానిమేటెడ్ వీడియోల క్వాలిటీ ఆఫ్ సర్వీస్ మెట్రిక్స్ అభివృద్ధి అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. యానిమేషన్ విభాగాధిపతి దినేష్ కుమార్, అధ్యాపకులు శివకృష్ణారెడ్డిని అభినందించారు.



సుండుపల్లి : రైతులకు సూచనలు ఇస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

సబ్సిడీ పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ వావిలవడ్డ గ్రామంలో పశుసంవర్ధకశాఖ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు ఆధ్వర్యంలో పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50శాతం సబ్సిడీతో 450 బస్తాల పశువులదాణాను పాడి రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువుల వైద్య సిబ్బంది రవికుమార్, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు. **చిన్నమండెం:** ప్రభుత్వం మండలానికి దాదాపుగా 42.5 మెట్రిక్ టన్నుల పశువుల దాణాను మంజూరు చేసింది. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సూచనల మేరకు కేశపురం గ్రామంలో పాడి రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ దాణ అందించారు. మండల టిడిపి అధ్యక్షులు మూగి రెడ్డప్ప మాట్లాడుతూ మంత్రి మండిపల్లి కృషి వల్ల పాడి రైతులకు ఎక్కువ మోతాదులో ప్రభుత్వం తరఫున దాణా మంజూరు చేయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక పాడి రైతు దాణా సరైన పద్ధతులు ఆవులకు అందించి పాల దిగుబడిని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ చెన్న కృష్ణ ,టిడిపి నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.



భోజనాన్ని వడ్డిస్తున్న గాలివీటి కుటుంబ సభ్యులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-వీరబల్లి

మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గాలివీటి కుటుంబ సభ్యులు మాజీ ఎంపిపి గాలివీటి విజయ భాస్కర్‌రెడ్డి, సెక్షన్ నెంబర్ గాలివీటి మురళిమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఎంపిపిల సంఘం ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగృహం నుంచి సమాధి వరకు వెళ్లి నివాళులర్పించారు. అనంతరం వచ్చిన ప్రజలకు అన్నదాన కార్యక్రమంలోంచారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వ్యక్తి గుండె శస్త్రచికిత్సకు సహకారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలో నివాసమున్న సిద్దయ్య గుండె సమస్యతో బాధపడుతూ అనంతపురం జిల్లాలోని ఒక ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు.అక్కడ నయం కాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది హైదరాబాద్ లేదా తిరుపతిలోని ఆసుపత్రికి సిద్ధయ్యని తీసుకెళ్లాలని సూచించారు.దీనిపై సిద్దయ్య కుమారుడి మిత్రుడు మహబూబ్ యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ రాజశేఖర్‌ని సంప్రదించారు.ఎన్టీఆర్ వైద్య సేవా ద్వారా బెంగళూరులోని వైదేహి హాస్పిటల్‌లో ఉచితంగా చికిత్స అందించారు లోకేష్ భరణి సహకారంతో సిద్దయ్య బైపాస్ సర్జరీ చేయించారు.ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సకు రూ.2లక్షలు అవసరమవుతాయని అయినా గ్యారెంటీ చెప్పలేదన్నారు వైదేహి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం యంగ్ ఇండియా ఫౌండేషన్ అవిరాళ కృషి చేస్తోందని తెలిపారు.

ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్‌గా నరేంద్రనాథ్

ప్రజాశక్తి-పుల్లంపేట

రాజంపేట రీజియన్ నుంచి రాష్ట్రోపాధ్యాయ సంఘం సీనియర్ నాయకులు అయిన బుదారపు నరేంద్రనాథ్ ను పుల్లంపేట మండలం నుంచి రాష్ట్ర కౌన్సిలర్‌గా రాష్ట్ర కమిటీ నియమించినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఉన్న నరేంద్రనాథ్ ను రాష్ట్ర కౌన్సిలర్ గా ఎన్నికావడం పట్ల రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, ఆది నారాయణ రెడ్డి, అల్లం అశోక్ కుమార్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి, ఎస్‌టియు మండల అధ్యక్షులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వల్లూరు సిద్దయ్య, గౌరవ అధ్యక్షులు గొబ్బూరు బాల నరసింహులు, ఆర్థిక కార్యదర్శి మలవతు శివరాం ప్రసాద్ జిల్లా కౌన్సిలర్లు దువ్వూరు హరినాథ్, మునగపాటి శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు.

నూలివీడు మైన్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన నూలివీడులో బుధవారం గ్రామ సమీపంలో ఉన్న మరార్ మైన్స్‌ను స్థానిక నాయకుడు శివారెడ్డి లీజుకు తీసుకోవడంతో ప్రజాభిప్రాయన సేకరణను ఆర్‌డిఒ ఎం.శ్రీనివాసులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు.సమావేశంలో పర్యావరణ ఇంజినీర్ సుధా, తహశీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామకృష్ణ, పలువులు ప్రజలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో 173 ఫోన్ల పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

నియోజకవర్గ పరిధిలోపి తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు సిడిపిఒ సుజాత నూతన 5జి సెల్ ఫోన్లను బుధవారం పంపిణీ చేశారు. శ్రీనివాస కాలనీలోని ఐసిడిఎస్ కార్యాలయంలో 173 అంగన్వాడీ టీచర్లు, 4సూపర్ వైజర్లు, ఒబిపిసికి ప్రభుత్వం కేటాయించిన 5జి ఫోన్లను అందజేశారు. గతంలో ఇచ్చిన ఫోన్లు సిగ్నల్స్, ఇంటర్ నెట్ సమస్యలతో పనిచేయడం లేదని వెనక్కి ఇచ్చిన విషయం తెలిసిందే. కార్యక్ర మంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు నాగలక్ష్మి, రమణమ్మ, నౌజియా బేగం పాల్గొన్నారు.

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుర్రంకొండ

పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సమీరుద్దీన్, సమీరుద్దీన్ మాట్లాడుతూ షర్మిల ప్రజా సమస్యలపై నిర్వీరామంగా పోరాటం చేస్తూ కూటమి ప్రభుత్వాన్ని నీలాదీసే తీరు అమోఘమైనదని కొనియాడారు. ఆమె నాయకత్వంలో పార్టీ శ్రేణులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు కార్యక్రమంలో జిల్లా మైనారిటీ జాయి ంట్ సెక్రటరీ గౌస్ బాషా, మండల కన్వీనర్ ఫైరోజ్ ఖాన్, మైనారిటీ నాయకులు ఖాజా, అర్షద్, నజీర్ పాల్గొన్నారు.



షర్మిల జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట

రాజకీయాల కన్నా పుట్టి పెరిగిన ప్రాంత అభివృద్ధే ముఖ్యమని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న 8వ రోజు రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. వివిధ పాఠశాలల నుంచి ర్యాలీగా తరలివచ్చిన విద్యార్థులతో కలిసి ఆయన పాత బస్టాండు కూడలిలో బైఠాయించి జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజంపేట ప్రజల మొర ఆలకించి జిల్లా కేంద్రంగా ప్రకటించి రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన తాళ్లపాక అన్నమాచార్యుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దీక్షా శిబిరంలో కూర్చుని జెఎసి నాయకులకు సంఘీభావం తెలిపారు.

'చమర్తి' సంఘీభావం

ఎనిమిదవ రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్న జెఎసినాయకులకు టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సంఘీభావం తెలిపారు. జెఎసి సభ్యుల ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ మండలాధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

నాయుడు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్, జెఎసి నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీగా పాత బస్టాండ్ కూడలికి చేరుకుని మానవహారం చేపట్టారు. నడిరోడ్డుపై కూర్చుని ఆందోళన చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలబడిపోయి గంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

యుఎఫ్‌ఎస్ సర్వేకు ప్రజలు సహకరించాలి



కలకడ : సర్వే పై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల సచివాలయ ఉద్యోగులకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే అవగాహన కల్పించినట్లు ఎంపిడిఒ గౌస్‌బాషా, డిప్యూటీ ఎంపిడిఒ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి గురించి ఒకేసారి సమగ్ర డేటా సేకరించడానికి మొదలుపెట్టిన పెద్ద సర్వే అన్నారు. సర్వే ఉద్దేశ్యం రాష్ట్రంలో ఉన్న అన్ని సోషల్ వెల్ఫేర్, రేషన్, పింఛన్, ఆరోగ్యశ్రీ, హౌసింగ్ లాంటి పథకాలను ఒకే "ఫ్యామిలీ డేటాబేస్" ఆధారంగా అమలు చేయడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి కుటుంబానికి యూనిక్ ఫ్యామిలీ ఐడి, ఫ్యామిలీ బెనిఫిట్ కార్డ్ ఇచ్చి, భవిష్యత్తులో ఒక్క డేటాబేస్ ద్వారానే అన్ని అర్హతలు, బెనిఫిట్లు నిర్ణయించే విధంగా వ్యవస్థను స్ట్రీమ్ లైన్ చేయడమే ఉద్దేశ్యం అని తెలిపారు. సర్వేను గ్రామ సచివాలయం, స్టాఫ్ మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తారు. డిసెంబర్ 15 నుంచి జనవరి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ మానిటరింగ్ ఉంటుందని తెలియజేశారు. ప్రజలు, సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఆధార్, రేషన్, ఓటర్ ఐడి, పాన్ కార్డు వంటి డాక్యుమెంట్లు రెడీగా పెట్టుకోవాలని సూచించారు. తప్పుడు, అసంపూర్ణ సమాచారం ఇస్తే భవిష్యత్తులో పథకాల హక్కులపై ప్రభావం పడే అవకాశం ఉందని, కాబట్టి సరిగ్గా వివరాలు ఇవ్వాలని, ఇదే విషయాన్ని ప్రభుత్వ ప్రచారంలో కూడా చెప్పడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనధికారి బసిరెడ్డి, పంచాయతీ కార్యదర్సులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** ఏకీకృత కుటుంబ సర్వే పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ఎంపిడిఒ చక్రపాణి పేర్కొన్నారు.మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి ఏకీకృత కుటుంబ సర్వేపై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాల సిబ్బంది తమ పరిధిలో ఉన్న కుటుంబాలను సర్వే చేసి వాటి వివరాలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పొందపరచాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఏకీకృత కుటుంబ సర్వేపై అవగాహన కలిగి, సర్వేని నిష్పక్షపాతంగా నిర్వహించా లన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిషత్ కార్యాలయం సభా భవనం నందు ఉదయం 11 గంటలకు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ ఆదేశానుసారం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే చేయు విధానంపై శిక్షణ తరగతులు నిర్వహిం చారు. ఈ శిక్షణ తరగతులకు మండలం నందలి అందరూ సచివాలయ సిబ్బంది రేపటి నుండి ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో సచివాలయ సిబ్బం దిచే సర్వే నిర్వహించడం జరుగుతున్నారు. ఈ సర్వే కి అందరూ ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు సహకరించాలని కార్యాలయ పరిపాలన అధికారి వై. శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కెవిపల్లి

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కెవి.పల్లి ఎస్ఐ బివి.శివకుమార్, శక్తి టీమ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల దుష్పరిణామాలు, పోక్సో చట్టం, సోషల్ మీడియా యాప్స్ వినియోగంలో జాగ్రత్తలు, శక్తి యాప్ ఉపయోగాలు గురించి విద్యార్థులకు వివరించారు.మహిళలు, బాలికలు ఎదుర్కొనే సమస్యలపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, శక్తి యాప్ ద్వారా వెంటనే సహాయం పొందవచ్చని సూచించారు. మత్తు పదార్థాలు వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. మహిళలు శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాదం ఉన్న సమయంలో శక్తి యాప్ రక్షణగా నిలుస్తుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎవ్వరూ బాల్య వివాహాలను ప్రోత్సహించ కూడదని చెప్పారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. చిన్న వయసులో వివాహం చేయడంవల్ల వారు మానసికంగా, శారీ రకంగా ఇబ్బందులు గురవుతారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారు ప్రయోజకులు అయిన తర్వాతే వివాహం చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు వినియోగం వల్లే జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. అనారోగ్యం బారిన పడి చిన్నవయసులో



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

తనవు చాలించే ప్రమాదం ఏర్పడుతుందన్నారు.సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాల్లు ఆశ చూపి బురిడి కొట్టిస్తారని చెప్పారు. ఒటిపి నంబర్లను ఎవ్వరికి షేర్ చేయవద్దని చెప్పారు. బ్యాంకు వివరాలు, ఎటిఎం కార్డులు వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో పిసి సుధాకర్, హెచ్‌సి రాజేష్, డబ్ల్యూపిపి దుర్గ, హెచ్‌జీ మురళి పాల్గొన్నారు.

వర్షాధార పంటలపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వర్షాధార భూములు పండించే పంటలు మోడల్స్ నీటి ఆధారిత భూముల్లో పండించి పంటల పై అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ డిపిఎం వెంకట మోహన్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన రెండో రోజు బుధవారం మండలంలోని కొండవాళ్లపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ద్వారా సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు చేసి భూములు 365 రోజులు పచ్చదనంతో కప్పి ఉండాలన్నారు. విభిన్న పంటలు వేయడం పంట వ్యర్థాలను భూమిలో మాల్చింగ్ లాగా ఉపయోగించుకోవడం పశువులను అనుసంధానం చేయడం, భూమి తక్కువ దుక్కులు దున్నడం, దేశీ విత్తనాలు వాడడంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న పిడిఎం వెంకటమోహన్

కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లో మధుకర్, వెంకటరమణ, రవీందర్‌గౌడ్, ఆర్‌పి హరిప్రియ, ఎఫ్ఎంటిలు, ఐఆర్‌పిలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్: ఇటీవల బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. బుధవారం ఆర్‌జెడి కార్యాలయంలో ఆర్‌జెడి శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ 2025 మే, జూన్‌లో జరిగిన ఉపా ధ్యాయ బదిలీల అనంతరం అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి బదిలీ పొందిన ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా పాత పాఠశాల ల్లోనే కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో 10వ తరగతి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న వేళ ఉపా ధ్యాయుల కొరత తీర్చడానికి ప్రభుత్వం అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించుటకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఎందుకు ఆలస్యమ వుతున్నదో తెలపాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను వెంటనే నియమించి బోధ నకు ఆటంకం లేకుండా చూడాలని, అకడమిక్ ఇన్స్ట్రక్టర్లు చేరిన వెంటనే ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'నాగార్జున'లో ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్: నగరంలోని మారుతినగర్‌లోని నాగార్జున మోడల్ స్కూల్లో బుధవారం క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్ స్పెక్ట్రా పేరుతో నిర్వహించిన ఈ వేడుకలను విద్యా సంస్థల చైర్మన్ ఎం.శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి ప్రారంభించారు. క్రీడా, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఒలంపిక్ తరహాలో క్రీడా జ్యోతిని రిలే పద్ధతిలో జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొన్న సాయి నిహారిక, ఆఫ్తాబ్, సాయి చరితేష్‌రెడ్డి, శ్రీవేఘాశాన్వి, నింకుజిత, శ్రీశరణ్య, అసద్ అలీఖాన్, సాయి రాకేస్, కార్తీక్ ద్వారా చైర్మన్‌కు అంద జేశారు. క్రీడా జ్యోతి ప్రజ్వలనతో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ డే ప్రారంభ సూచికగా చైర్మన్, డైరెక్టర్ పావురాలను గాలిలోకి ఎగురవేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు వస్తాయని పేర్కొన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచడానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపల్ సాయి కృష్ణ పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్‌స అందజేశారు.

నాయకుల లబ్ధి కోసమే పిపిపి విధానం

ప్రజాశక్తి - కడప

అధికార పార్టీ నాయకులకు లబ్ది చేకూర్చేందుకే చంద్రబాబు పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేసే చర్యలు చేపట్టారని వైసిపి వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా రాష్ట్రానికి అనుభవజులైన సంపద సృష్టించే నాయకుడు అవసరమని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్లలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టి దాదాపు పూర్తి చేయగా, చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల పాలనలో వాటిని పూర్తి చేయకపోగా పిపిపి విధానంలో తన పార్టీలోని నేతలకు కట్టబెట్టే చర్యలకు తెర తీసిందన్నారు. కళాశాలలను ప్రారంభించిన తర్వాత ఒక్కొక్కటిగా అవసరమైన సదుపాయాలు కల్పించుకోవచ్చన్నారు. పేదలు వైద్య విద్యకు దూరమవుతారన్నారు.

ఉద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వం : యుటిఎఫ్

ప్రజాశక్తి - బద్వేలు

ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరిస్తోందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ విమర్శించారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బద్వేలు, గోపవరం మండలాల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాక మునుపు కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. ఆ హామీలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే, ఉద్యోగుల సహకారంతో అధికారం చేపట్టిన ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో యుటి ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.శివప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, యుటిఎఫ్ బద్వేల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవా నందం, కె.సుధాకర్, గోపవరం మండల అధ్యక్షులు పి.తిరుపాల్ రెడ్డి, ట్రెజరర్ ఎం.రామచంద్రయ్య సీనియర్ నాయకులు వీరదాసరి క్రిస్టఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.కంచిరెడ్డి, ఎస్.మస్తాన్ వలి, ఎ.లాజరస్, సుబ్బరాజా, ఓబన్న, ఎన్.పవన్ కుమార్ పాల్గొన్నారు.



కాలిపోయిన పండ్ల దుకాణాన్ని పరిశీలిస్తున్న జగన్‌మోహన్‌రాజు

పండ్ల దుకాణం దగ్ధం

- రూ.7 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-రాజంపేట

పట్టణంలోని పాత పోలీసు లైన్‌వీధిలోగల గాంధీ విగ్రహం వద్దనున్న ఇర్ఫాన్ పండ్ల దుకాణం బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు చేష్టలతో పూర్తిగా దగ్ధమైపోయింది. దుండగుడు ద్విచక్ర వాహనంపై వచ్చి దుకాణాన్ని దగ్ధం చేసినట్లు సిసి పుటేజీలో రికార్డు అయింది. ఈ ప్రమాదంలో దుకాణం బయట ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు సైతం దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.7 లక్షలు నష్టం వాటిల్లినట్లు దుకాణం యజమాని తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అగ్నికి ఆహుతి అయిన షేక్ ఇర్ఫాన్‌కు చెందిన పండ్ల దుకాణాన్ని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్రాజు సందర్శించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి దుకాణం యజమానితో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అన్ని విధాల ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



ఎం.గొబ్రియనాయక్ ఎం.రవీంద్ర పి.ప్రసాద్ బాబు

యుటిఎఫ్ నిమ్మనపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు యుటి ఎఫ్ జిల్లా కౌన్సిలర్ నాదీర్ షావలి, జిల్లా ఉపాధ్యక్షురాలు హేమలత తెలిపారు. బుధవారం వారు స్థానిక కార్యాలయంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ఎంపిక ప్రక్రియను నిర్వహించడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన యుటిఎఫ్ మండల కమిటీలో అధ్యక్షులుగా ఎం.గొబ్రియా నాయక్ (జడ్పీహెచ్ఎస్ కొమ్మిరెడ్డిగారిపల్లి), గౌరవ అధ్యక్షులుగా ఎం.రవీంద్ర, జడ్‌పిహెచ్ఎస్ నిమ్మనపల్లి(తెలుగు), ప్రధాన కార్యదర్శిగా పి.ప్రసాద్‌బాబు, సహ అధ్యక్షులుగా ఎన్.రాజశేఖర్, పి.జయశ్రీ, ట్రెజరర్‌గా బి.సురేంద్రనాయక్, మహిళా కార్యదర్శిగా పి.జరీనాబేగం, గౌరవ సలహాదారులుగా బి.వెంకటరమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యుటిఎఫ్ నాయకుల ఆదేశాలతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈనెల 21వ తేదీన పీలేరులో జరిగే అన్నమయ్య జిల్లా కౌన్సిల్ సమావేశాలకు మండల యుటిఎఫ్ సభ్యులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రం నిమ్మనపల్లి జడ్‌పి హైస్కూల్(తెలుగు)లో గురువారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు పద్మావతి, నారాయణ తెలిపారు. మండలంలోని ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా వారు ఎంచుకున్న థీమ్ వైస్ ప్రాజెక్టులను ప్రదర్శించడానికి హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసుకుని సైన్స్ ప్రదర్శన పోటీలకు విద్యార్థులు ప్రదర్శించబోతున్న ప్రాజెక్టు నమూనాలతో సమయానికి హాజరు కావాలని ఆయన సూచించారు.



వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులు

'ఆదిత్య'లో డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్ పై ఒక రోజు వర్క్‌షాప్‌ను బుధవారం విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్సిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో 'డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. సమకాలీన పరిశ్రమల అవసరాలు, సామాజిక సవాళ్లను దృష్టిలో ఉంచుకుని,ఇంజినీరింగ్ విద్యార్థులలో వినూత్న ఆలోచన, విశ్లేషణాత్మక సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే వర్క్‌షాప్ ముఖ్య లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ ఆర్.రామమోహన్‌రెడ్డి, అధ్యక్షులు ఎం.నాగమల్లారెడ్డి హాజరయ్యారు. వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో డిజైన్ థింకింగ్ ప్రాధాన్యతను వారు వివరించారు.

లెక్చరర్‌పై దాడి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న వసంతరావుపై వ్యక్తిగత కక్షలతో ముగ్గురు దాడి చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు నాగభూషణం, చంద్రకళ, హర్షవర్ధన్, వసంతరావు కళాశాలకు వెళుతున్న సమ యంలో దాడి చేశారని చెప్పారు. ఈ దాడిలో వసంతరావుకు రక్తగాయాలు అయ్యాయని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భద్రత కోసం సిసి కెమెరాలు అమర్చుకోవాలి

ప్రజాశక్తి-చిట్వేలి

ప్రతి ఒక్కరూ భద్రత కోసం సిసి కెమెరాలు అర్చుకోవడం ఎంతో లాభదాయకమని ఎస్ఐ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని అన్ని దుకాణ యజమానులతో స్థానిక పోలీసు స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వివిధ రకాల చోరీలు జరుగుతున్నాయని వాటిని అరికట్టాలంటే నిఘా నేత్రాలు ఎంతగానో తోడ్పాటును అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ సమాజానికి తమ వంతు బాధ్యతగా సిసి కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుకాణాదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సిసి కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వినోద్‌కుమార్